క్లుప్తంగా

శివారు భూములకు సాగునీరు


కొప్పరవలస వద్ద తోటపల్లి కాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళి

వంగర: మండల పరిధిలోని శివారు భూములకు తోటపల్లి ప్రాజెక్ట్ నుంచి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళి అన్నారు. మండల పరిధిలోని బంగారువలస, కొప్పరవలస గ్రామాల వద్ద రూ.4 లక్షల అంచనా వ్యయంతో కాలువలో చేపడుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావునాయుడు, పిన్నింటి మోహనరావు, ఇరిగేషన్ ఏఈ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నారు చిగుర్లు తొలగించాలి


అంబఖండిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి : నారు ఉడిచే సమయంలోనే రైతులు చిగుర్లు తొలగించాలని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబఖండి, ఉంగరాడ, గుళ్లపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉబాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నారు ఉడిచే పద్ధతిపై రైతులకు పలు సూచనలు చేశారు. నారు చిగుర్లు తుంచడం వల్ల పైరుకు తెగుళ్ల బెడద ఉండదని చెప్పారు.

చెరువును తలపిస్తున్న పొలాలు


వన్నలిలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

రేగిడి: మండలంలో అంబఖండి, వన్నలి, ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లోని పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కందిగెడ్డలో నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో నీరు పొలాల్లోకి చేరుతోంది. నాట్లు వేసిన పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్

రాజాం : పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు పలు సూచనలు చేశారు. అనంతరం అనంతరం పలు వార్డుల్లో చెత్త సేకరణ పనులను పరిశీలించారు.

మొక్కలు నాటుదాం..


తిమ్మయ్యపేటలో మొక్కలు నాటుతున్న ట్రస్ట్ సభ్యులు

రాజాం సిటీ: మొక్కలు నాటడంతో పాటు భావితరాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభావతి జాగృతి ట్రస్టు వ్యవస్థాపకుడు సప్పటి వసంతరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి తిమ్మయ్యపేట గ్రామంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఖాళీ ప్రదేశాలతో పాటు ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న నైపుణ్యాల గణనలో తమ పేర్లను ప్రతిఒక్కరూ నమోదుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి ఉబాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస, గోపాలరాయుడుపేట, నారసింహునిపేట, పారాది, గొర్లెసీతారాంపురం తదితర గ్రామాల్లో వరి ఉబాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో దమ్ము పనులు, వరినారుతీతలు చేపట్టారు. ఈ పనులు జరిగిన చోట వరినాట్లు వేసే పనులు(ఉబాలు) చేపట్టారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు..


బొబ్బిలి రూరల్: అలజంగిలో ప్రత్యేకాలంకరణలో షిర్డీసాయిబాబా


రాజాం సిటీ: వికాస తరంగిణి కార్యాలయంలో గురుపౌర్ణమి వేడుకలు


తెర్లాం సత్యసాయిబాబా ఆలయంలో షిర్డీసాయికి పూజలు చేస్తున్న చిన్నారులు


రేగిడి: దత్తపీఠంలో మాట్లాడుతున్న ఆధ్యాత్మిక గురువు రమణ


సంతకవిటి: రంగారాయపురంలో షిర్డీ సాయిబాబాకు అభిషేకం చేస్తున్న భక్తులు

ఆషాఢ శుద్ధ పౌర్ణమి, వ్యాస భగవానుడి జన్మదినం సందర్భంగా ఆదివారం వాడవాడలా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్య, షిర్డీ సాయిబాబా ఆలయాలతో పాటు గ్రామాల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గురువులను సత్కరించారు. అజ్ఞానం, అంధకారం పోగొట్టే శక్తి గురువులకే ఉంటుందని.. అటువంటి గురువులను సత్కరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసింది.

– రాజాం/బొబ్బిలి నెట్‌వర్క్


రాజాం : గాయత్రీ ధ్యానమందిరంలో గురువు విగ్రహానికి సత్కారం చేస్తున్న భక్తులు


బొబ్బిలి: ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద షిర్డీసాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకులు


వంగర: రుషింగి షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రామభద్రపురం షిర్డీసాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు


రామభద్రపురం: పూజల్లో పాల్గొన్న భక్తులు


రేగిడి : సంకిలి షిర్డీసాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

వ్యవ‘సాయం’ ఏది బాబు..?

- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ
- ఖరీఫ్ పనులు జరుగుతున్నా ప్రకటన చేయని ప్రభుత్వం
- రైతుకు తప్పని ఎదురుచూపులు


నాయుడువలసలో నాగలి సాయంతో దుక్కి పని చేస్తున్న రైతు

రామభద్రపురం: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే మొక్కజొన్న, పత్తి, చెరకు, కూరగాయలు తదితర పంటలను 1033 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. అయితే దుక్కి పనులు, విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు, వరినాట్లు వేసేందుకు పెట్టుబడి సాయం అవసరం. గత ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన పెట్టుబడి సాయం అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడింది. ఏటా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.7,500ను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా జమచేశాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తొలివిడత సాయం కింద రూ.2 వేలు మాత్రమే వేయగా, ఏడాదికి రూ.20 వేలను సాగుకు సాయంగా అందిస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించినా అది ఇంకా అమలు చేయకపోవడంతో రైతుకు ఎదురుచూపులు తప్పడం లేదు.

రెండోసారి సమావేశమైనా..

ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్‌లతో రెండోసారి కేబినెట్ సమావేశం జరిగినా రైతులకు ఇస్తామన్న సాయంపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం రైతాంగాన్ని కలవరానికి గురిచేస్తోంది. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే సదుద్దేశ్యంతో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా రైతు భరోసా పథకం కింద ఇచ్చిన పెట్టుబడి సాయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అప్పటి ప్రభుత్వమే మంచిదని, ఏటా క్రమం తప్పకుండా ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన తేదీకి డబ్బులు వేసేదని అన్నదాతలు అంటున్నారు.


వ్యవసాయానికి పెట్టుబడి సాయం ఇవ్వాలని కోరుతున్న కొండకెంగువ రైతులు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆశాజనకంగా పంటల సాగు


ఆమిటిలో సాగు చేస్తున్న గోగు పంట


కొరటాంలో ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

తెర్లాం: మండలంలోని మెట్టుభూముల్లో రైతులు సాగుచేస్తున్న పంటలు ఈ ఏడాది ఆశాజనకంగా ఉన్నాయి. చాలా గ్రామాల్లోని మెట్టుభూముల్లో మొక్కజొన్న, గోగు, పత్తి తదితర పంటలు సాగులో ఉండగా సకాలంలో కురిసిన వర్షాలతో ఆయా పంటలు బాగా పండేలా పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు భావిస్తున్నారు. కొరటాం, కొల్లివలస, గొలుగువలస, ఆమిటి, కవిరాయునివలస, అప్పలంపేట, బూరిపేట, ఎస్.బూర్జవలస, నెమలాం, సుందరాడ, ఉద్దవోలు, చుక్కవలస, వి.చిన్నయ్యపేట గ్రామాల్లోని రైతులు అధికంగా మొక్కజొన్న పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. ఆమిటి, కొరటాం గ్రామాల్లోని రైతులు గోగు పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. సుందరాడ, ఉద్దవోలు గ్రామాల్లో పత్తి, మిరప పంటలు సాగులో ఉన్నాయి. ఆయా పంటల్లో రైతులు ప్రస్తుతం సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులు ఇదే విధంగా అనుకూలిస్తే పంట బాగా కలిసివస్తుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ మండల ప్రెసిడెంట్‌గా ధర్మారావు

రామభద్రపురం: ఇండో హ్యూమన్ రైట్స్ మండల ప్రెసిడెంట్‌గా ఆరికతోట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కనకల ధర్మారావు, సెక్రటరీగా బి.కృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు గ్రామపెద్దలు, ప్రజలు ఆదివారం కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తమవంతు కృషి చేస్తామన్నారు. తమపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తామన్నారు. తమ దృష్టికి వచ్చిన మానవహక్కుల ఉల్లంఘనలు, వేధింపులను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి మానవహక్కుల కమిటీ దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా మానవహక్కులకు భంగం కలిగితే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.


ధర్మారావుకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందిస్తున్న గ్రామపెద్దలు

రోడ్డు వేయండి


అధ్వానంగా ఉద్దవోలు-గడ్డిముడిదాం రోడ్డు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు నుంచి గడ్డిముడిదాం మీదుగా రాజాం వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఉద్దవోలు, యు.గదబవలస గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్దవోలు నుంచి రాజాం వరకు 11 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఉంది. రాజాం నుంచి గడ్డిముడిదాం వరకు తారురోడ్డు గతంలోనే వేశారు. గడ్డిముడిదాం నుంచి ఉద్దవోలు వరకు ఉన్న 5 కిలోమీటర్ల రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించాల్సి ఉంది. అయితే గత 20 ఏళ్లుగా ఉద్దవోలు నుంచి గడ్డిముడిదాం వరకు బీటీ రోడ్డు వేయాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదు. రోడ్డంతా గోతులమయమై కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడపలేని దుస్థితి. రోడ్డు బాగా లేకపోవడంతో ఉద్దవోలు నుంచి బూరాడ జంక్షన్ మీదుగా రాజాం వెళ్లాల్సి వస్తోందని ప్రజలు, ప్రయాణీకులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, బీటీ రోడ్డు నిర్మించాలని ఉద్దవోలు సర్పంచ్ ఎచ్చెర్ల సునీతతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

గోతుల పూడ్చివేత

వంగర: మండల పరిధి అరసాడ జంక్షన్ నుంచి సీలయ్యవలస వరకున్న రోడ్డు గోతులతో నిండిపోవడంతో మరమ్మతులకు స్థానిక యువత ముందుకొచ్చింది. బాగంపేటకు చెందిన యువత రూ. 20 వేల విరాళాలు సేకరించి జేసీబీ సహాయంతో ఆదివారం గుంతలు పూడ్చారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలను యువకులను అభినందించారు.

సంపద కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి

రేగిడి: ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టిట్ కేంద్రాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ శ్యామలాకుమారి సూచించారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస, సంకిలి, తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో ఇంటింటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు సేకరిస్తున్న చెత్తను డంపింగ్ యార్డులో వేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తద్వారా తయారవుతున్న వర్మీ కంపోస్టును రైతులకు విక్రయించి, పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు.

ఏపీఈపీడీసీఎల్ యాప్‌తో అవస్థలు

బొబ్బిలి: విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఏపీఈపీడీసీఎల్ తీసుకువచ్చిన యాప్‌తో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. యాప్ బాగా పనిచేయకపోవడంతో బిల్లులు కట్టేవారంతా విసుగుచెందుతున్నారు. ఇదే విషయమై ఆ శాఖ ఉన్నతాధికారులను సంప్రదిస్తే సాఫ్ట్‌వేర్ స్లో అవుతోందని, త్వరలోనే యాప్ బాగా పనిచేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

దాడులు ఆపకుంటే పోరాటం తప్పదు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు ఆపకపోతే బాధితుల తరపున పోరాటం చేయకతప్పదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలు నెరవేర్చకుండా.. ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు చేయడం, వారి ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడం చేస్తోందని ఆరోపించారు. గత నెలలో ఇదే మండలం బొద్దాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌పై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని, ఆ సంఘటన మరువకముందే గురవాం గ్రామంలో సాధారణ పిండిమిల్లు నడిపి జీవనం సాగించే ధనుంజయ అనే వైఎస్సార్‌సీపీ అభిమాని షాపు కూల్చేశారన్నారు. అధికారులు సైతం నిబంధనలు ఉల్లంఘించి ఇలా షాపును కూల్చడం దారుణమని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఆరోపించారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను హత్యచేస్తే ఇంతవరకు సీఎం, డిప్యూటీ సీఎంలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జరుగుతున్న ఘోరాలను తమ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రపతికి వివరిస్తామని చెప్పారు. ఇప్పటికైనా, అధికార పార్టీ తమ పంథాను మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, ఆల్తి సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి కనబరచాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న దృశ్యం

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని, ప్రతీ విద్యార్థి పుస్తక పఠనంపై ఆసక్తి కనబరచాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు పుస్తకాలు ఎలా చదవాలి, పుస్తకాల్లోని విషయాలను ఏ విధంగా గుర్తుపెట్టుకోవాలి, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నప్పుడు ప్రదర్శించాల్సిన మెలకువలను నేర్పించారు. ప్రతీ విద్యార్థి గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరి, ఇక్కడి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.